నమస్తే తెలంగాణ
# జగిత్యాల
3 | కరీంనగర్, ఆదివారం 4 మే 2025 | JAGTIAL

# మాటిచ్చి.. నిలబెట్టుకొని..



నవదుర్గ ఆలయ సేవా సమితి సభ్యులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- నవదుర్గ ఆలయాభివృద్ధి కృషిచేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్సీ కవిత
- రాజ్యసభ ఎంపీ దీవకొండ దామోదర్‌రావు ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.కోటి మంజూరు
- సేవా సమితి సభ్యులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేత

జగిత్యాల, మే 3: జగిత్యాల జిల్లా కేంద్రంలోని నవదుర్గ ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేయూతనందించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నవదుర్గ సేవా సమితి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని మాటిచ్చి.. నేడు నిలబెట్టుకున్నారు. రాజ్యసభ ఎంపీ దీవకొండ దామోదర్‌రావు ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి ఆలయ అభివృద్ధి కోసం కోటి రూపాయలు మంజూరు చేయించారు. ఈ క్రమంలోజడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేశ్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నవదుర్గ ఆలయ సేవా సమితి సభ్యులకు కోటి రూపాయల నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. అమ్మవారి దయ ప్రజలందరిపై ఉండాలన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎంపీ దామోదర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేశ్‌కు నవదుర్గ సేవా సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కస్తూరి శ్రీనివాస్, అంగరి నాగరాజు, బూస ఉమాపతి, అనుమల్ల వాసు, అంగరి విజయ్‌కుమార్, సిరిపురపు జితేందర్, గుండేటి వెంకటరమణ, అనుముల చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

# అడుగు పెరిగినా రిజక్టే..

**ఇందిరమ్మ ఇండ్లపై సర్కారు నిబంధన**

- 600 చదరపు అడుగుల విస్తీర్ణం దాటితే కట్
- గందరగోళంగా నిర్మాణ కొలతలు
- మంత్రి ప్రకటనతో లబ్ధిదారుల కలవరం
- ముందే ఎందుకు చెప్పలేదని ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో బేస్‌మెంట్లు
- ఆన్‌లైన్‌లో ఆమోదించని వెబ్‌సైట్



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని గుండారంలో బిల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్న పండుగు సత్తవ్వ

**ఇందిరమ్మ ఇంటి నిర్మాణ కొలతల్లో గందర గోళం నెలకొన్నది. 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా 600 చదరపు అడుగుల విస్తీర్ణానికి ఎక్కువ కాకుండా నిర్మాణం ఉండాలని తాజా నిబంధన అనేక సమస్యలకు దారి తీస్తున్నది. ఉమ్మడి జిల్లాలో ఈ విషయం చాలా మంది లబ్ధిదారులకు తెలియక ఎక్కువ విస్తీర్ణంలో ముగ్గులు పోసుకుని, బేస్‌మెంట్లు కూడా నిర్మించుకోవడం, 600 చదరపు అడుగులు దాటిన ఇండ్లను రిజెక్ట్ చేయాలని స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన ఇవ్వడం కలవరపెడుతున్నది. నిర్మించుకున్న బేస్‌మెంట్లు కూల్చేది ఎలాగని తలలు పట్టుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఆయా జిల్లాల్లో పదుల సంఖ్యలో నిర్మాణాలు జరిగినట్లు తెలుస్తుండగా, అధికారులు మాత్రం అవగాహన కల్పిస్తున్నామని, తక్కువ సంఖ్యలోనే ఉన్నాయని చెబుతున్నారు.**

కరీంనగర్, మే 3 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల కొలతల విషయంలో నెలకొన్న గందరగోళం వీడడం లేదు. గత జనవరి 26న పైలెట్ గ్రామాల్లో అధికారికంగా పంపిణీ చేసిన ప్రొసీడింగ్‌ల్లో కొలతలు ప్రస్తావించ లేదని కొందరు లబ్ధిదారులు వాపోతున్నారు. అయితే ప్రభుత్వం కొలతలు నిర్ణయించే సరికే ప్రొసీడింగ్‌లు అందుకున్న కొందరు మార్కౌట్ ఇచ్చుకుని పునాదులు తవ్వుకున్నారు. మరి కొందరైతే బేస్‌మెంట్లు కూడా నిర్మించుకున్నారు. తీరా శుక్రవారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్‌లో 600 చదరపు అడుగులకు మించి ఉన్న ఇండ్లను రిజెక్ట్ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో బిల్లులు చేయవద్దని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఇప్పటికే ఎక్కువ కొలతలతో బేస్‌మెంట్లు నిర్మించుకున్న లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. హౌసింగ్ బోర్డు అధికారులతో తమకు ముందే చెప్పిస్తే బాగుండేదని లబ్ధిదారులు వాపోతున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఈ రకంగా పదుల సంఖ్యలో ఇండ్లు ఉన్నట్లు తెలుస్తోంది. క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఏఈలు ఇప్పటికే కొన్నింటిని రిజెక్ట్ చేసినట్లు తెలుస్తోంది. కొలతలు ఎక్కువ ఉన్న ఇండ్లు బిల్లుల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఆమోదించడం లేదు. 600 చదరపు అడుగుల్లో బేస్‌మెంట్ నిర్మించుకుంటే కనీసం రూ.2 లక్షలకుపైగా ఖర్చు వస్తోంది. అయితే, ప్రభుత్వం ఇచ్చేది మాత్రం రూ.లక్ష మాత్రమే. ఇందిరమ్మ ఇల్లు కింద బిల్లులు వస్తాయనే ఆశతో కొలతలు తెలియకుండా బేస్‌మెంట్స్ నిర్మించుకున్న లబ్ధిదారులు ఇప్పుడు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. అప్పు తెచ్చుకుని కట్టుకున్న బేస్‌మెంట్లను కూల్చే పరిస్థితి కనిపించడం లేదు. పైగా కట్టిన ఇంటిని కూల్చితే సెంటిమెంట్ ప్రకారం మంచిది కాదనే భావన లబ్ధిదారుల్లో కనిపిస్తోంది.

## ముందే ఎందుకు చెప్పలేదు..?

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ప్రచారం చేసిన ప్రభుత్వం లక్షల సంఖ్యలో వచ్చిన దరఖాస్తులు పరిశీలించిన తర్వాత మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసింది. ఇప్పుడు ఈ గ్రామాల్లోనే మొదట ప్రారంభించిన ఆరుగ్యారంటీల్లో నాలుగింటిని అమలు చేస్తోంది. అందులో ముఖ్యమైనది ఇందిరమ్మ ఇల్లు. రూ.5 లక్షలు వస్తాయంటే తమకు ఎంతో ఆసరా అవుతుందని ఆశపడిన తమకు ముందే కొలతలు ఈ విధంగా ఉండాలని ఏ అధికారి చెప్ప లేదని, కొలతలు ఎంత పెట్టుకోవాలో అడిగేందుకు కూడా అధికారులు అందుబాటులో లేరని లబ్ధిదారులు వాపోతున్నారు. పైలెట్ గ్రామాల్లో మార్కౌట్లు ఇచ్చిన పంచాయతీ కార్యదర్శులకే ఈ విషయమై ముందు స్పష్టత లేదు. అయితే 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా ముగ్గు పోసుకోవాలని మాత్రం సూచించినట్లు తెలుస్తోంది. గరిష్టంగా 600 చదరపు అడుగులకు మించ రాదని మాత్రం తమకు చెప్పలేదని కొందరు లబ్ధిదారులు అంటున్నారు. అసలే నిరుపేదలైన లబ్ధిదారులు అప్పులు తెచ్చి కట్టుకున్న ఇండ్లను కూల్చుకోవాలా వద్దా అనే మీమాంసలో పడ్డారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా పెద్దపల్లి జిల్లాలో కొలతలకంటే అధికంగా నిర్మించిన బేస్‌మెంట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత జగిత్యాలలో కూడా పదుల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో మాత్రం కొంత తక్కువ సంఖ్యలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కొలతల విషయంలో లబ్ధిదారులకు ముందే చెబుతున్నామని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. అధికారులు చెప్పిన తర్వాత తామెందుకు ఎక్కువ పెట్టుకుంటామని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

## మంత్రి ప్రకటనతో నైరాశ్యం..

ఇందిరమ్మ ఇండ్ల విషయంలో సంబంధిత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన ప్రకటనతో కొలతలు ఎక్కువ పెట్టుకుని బేస్‌మెంట్లు నిర్మించుకున్న లబ్ధిదారులు నైరాశ్యంలో పడ్డారు. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, సొంత స్థలాల్లోనే ఇండ్లు నిర్మించుకుంటే రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు కొలతల విషయంలో ఆంక్షలు విధించడం కొందరు లబ్ధిదారుల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 600 చదరుపు అడుగులు దాటితే రిజెక్ట్ చేయాలని చెప్పడంతో ఇక తామెవరికి చెప్పుకొనేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రొసీడింగ్‌లపై కొలతలు మెన్షన్ చేశామని అధికారులు చెబుతుండగా, ముందు ఇచ్చిన ఏ ప్రొసీడింగ్‌పై కొలతల ప్రస్తావనే లేదని లబ్ధిదారులు అంటున్నారు. నిజానికి సమాచార లోపంతోనే ఇలా జరిగినట్లు స్పష్టంగా అర్థమవుతోంది. ప్రతి నియోజక వర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేసిన ప్రభుత్వం మొదట పైలెట్ గ్రామాల్లో మాత్రమే ఇందిరమ్మ ఇండ్లకు ప్రొసీడింగ్‌లు ఇచ్చింది. ఇండ్లను పర్యవేక్షించేందుకు గతంలో ఉన్న హౌసింగ్ సంస్థను పునరుద్ధరించింది. అయితే, ఈ శాఖకు మాత్రం తగినంత సిబ్బందిని మాత్రం కేటాయించ లేదు. ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఒక డీఈ, ఏఈని, జిల్లా స్థాయిలో ఒక పీడీని నియమించారు. ఈ లెక్కన ప్రతి జిల్లాకు ఐదుగురు అధికారులు ఉండాలి. కానీ నలుగురు మాత్రమే చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఐదుగురు అధికారులు ఉన్నా సరిపోకపోవడంతో ప్రత్యేక అధికారులను నియమించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు పర్యవేక్షిస్తుండగా క్షేత్ర స్థాయిలో పంచాయతీ కార్యదర్శులను వినియోగించుకుంటున్నారు. గత జనవరి 26న ప్రొసీడింగ్‌లు పంపిణీ చేసే నాటికి ఎంపీడీవోలే ఈ పథకాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఆ తర్వాత ఇంజినీరింగ్ అధికారులను నియమించారు. అయితే, ప్రొసీడింగ్‌లు ఇచ్చిన సమయంలోనే కొలతలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తే ఇలాంటి పరిస్థితి ఉండేది కాదనే అభిప్రాయాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కొలతలు మీరి నిర్మించుకున్న లబ్ధిదారులు ఇపుడు ఇందిరమ్మ బిల్లుల కోసం ఇంటిని కూల్చుకోవాలా..? అనే మీమాంసలో పడ్డారు. అయితే, ఇప్పటి వరకు కొలతలు ఎక్కువ పెట్టి నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లించి, ఇక నుంచి కొలతలు సరిగ్గా అమలు చేస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు.

# రానున్న రోజుల్లో అధికారం బీఆర్‌ఎస్‌దే

- ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- బీఆర్‌ఎస్‌లో పలువురు నాయకుల చేరిక
- గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన మధూకర్



కార్యకర్తలకు గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, మే 3: రానున్న రోజుల్లో మళ్లీ అధికారం బీఆర్‌ఎస్ పార్టీదేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్పష్టం చేశారు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం వల్లెంకుంట గ్రామానికి చెందిన ఆడుప కిషన్, సుధాటి వెంకటేశ్ శనివారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని రాజగృహలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పుట్ట మధూకర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆరు గ్యారెంటీలంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు వాటిని అమలు చేయకుండా ప్రజలను నిండా ముంచిందని విమర్శించారు. ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయకుండా మాయమాటలతో కాలం వెల్లదీస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నారన్నారు. అతి తక్కువ సమయంలో ప్రజాధరణ కోల్పోయిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని ధ్వజమెత్తారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు లేక ప్రజలంతా ఆగమాగం అవుతున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ఎవరెన్ని కుట్రలు చేసినా బీఆర్‌ఎస్ పార్టీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మావోయిస్టులతో చర్చలు జరపాలి

- శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్




సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

జమ్మికుంట, మే 3: కేంద్ర ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం-మావోయిస్టుల మధ్య శాంతి చర్చల ఆవశ్యకతపై మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో స్థానిక వినాయక గార్డెన్‌లో హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య అధ్యక్షన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి ఏండ్లు గడిచినా ప్రజలకు కల్తీ లేని ఆహారం, గాలిదొరికే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లోని ఆదివాసీలకు రాజ్యాంగం ప్రత్యేక హక్కులు కల్పించిందని, ఆ హక్కుల ప్రకారం వారు స్వయంపాలన అధికారం కలిగి ఉంటారన్నారు. అలాంటి గిరిజన ప్రాంతాల్లో వారి నిర్ణయాలకు వ్యతిరేకంగా చేసే అధికారం ఎవరికీ లేదన్నారు. ఆదివాసీల హక్కులకు ప్రభుత్వం విఘాతం కలిగిస్తున్నదని ఆరోపించారు. మావోలు, కేంద్రం హింసను వీడాలని, శాంతిచర్చలు జరిపించేందుకు మేం సిద్ధంగా ఉన్నామని తెలిపారు. చర్చలకు సిద్ధంగా ఉన్నామని మావోలు ప్రకటించినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం మావోలను చుట్టుముట్టేందుకు బలగాలను పంపించడం ధర్మంకాదన్నారు. చర్చల ప్రక్రియ కోసం అన్నివర్గాల ప్రజలు గొంతువిప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయ, రాజేశ్వర్‌రావు, రామస్వామి, రమేశ్, సదయ్య, కోటి, వాసుదేవరెడ్డి, రాజు, హరికృష్ణ, రంజిత్, సామ్రాజ్యం, మోహన్, సమ్మయ్య, నరహరి, సంపత్‌రావు, సజ్జు, ఇమ్రాన్, హరిబాబు, శిరీష, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ భూమి కబ్జా

**ధర్మారంలోని రెండు సర్వే నంబర్లలో 11.50 గుంటల్లో పాగా**

- మరో ఎకరానికి ఎసరు
- ఒక చోట ఇంటి నిర్మాణానికి పూనుకున్న కబ్జాదారులు
- నిలిపివేయాలని చెప్పినా పట్టించుకోని వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు
- విచారణ చేపడతామంటున్న పోలీసులు



సర్వే నెం. 297లో కబ్జాకు గురైన 9గుంటల ఎస్ఆర్ఎస్‌పీ భూమి

**ఎస్సారెస్పీ భూమిని కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. ఒక చోట 9 గుంటలు, మరోచోట రెండున్నర గుంటలు కబ్జా చేయడంతో పాటు మరోచోట ఎకరం భూమికి ఎసరు పెట్టారు. అంతే కాకుండా, కబ్జా చేసిన భూమిలో ఓ చోట ఇంటి నిర్మాణానికి సైతం పూనుకున్నారు. అప్రమత్తమైన అధికారులు నిర్మాణాన్ని నిలిపివేయాలని చెప్పినా పట్టించుకోకపోవడమే కాకుండా, అధికారులనే భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.**

పెద్దపల్లి, మే 3(నమస్తే తెలంగాణ) : పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని క్యాంపు, కాలువలు నాలుగు ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉండేవి. 2022 వరకు జగిత్యాల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు క్యాంపు పరిధిలో ధర్మారం క్యాంపు ఉండేది. 1978లో ఇక్కడ 1.26 ఎకరాల భూమికి అవార్డు పాస్ కాగా ప్రభుత్వం భూమిని సేకరించింది. ఇందుకు గాను నిర్వాసితులకు ప్రభుత్వం అప్పుడు రూ.2,329 పరిహారం అందజేసింది. కానీ, రెవెన్యూ అధికారులు సేకరించిన భూమిని రెవెన్యూ రికార్డుల్లోంచి తొలగించలేదు. భూములను ఆన్‌లైన్‌కు అనుసంధానం చేయగా.. అప్పటి నిర్వాసితులకు సంబంధించిన వారి పేరున ఆన్‌లైన్‌లో కనిపించింది. ఇది చూసిన ఒక ప్రజాప్రతినిధి వారికి కొంత ముట్టజెప్పి అక్రమాలకు తెర తీశారు. ఇలా సర్వే నంబర్ 297లోని 9 గుంటల ప్రభుత్వ భూమిని ఎలాంటి లింక్ డాక్యుమెంట్ లేకుండానే 2023లో అమరపెల్లి లస్మమ్మ, ఆమె కొడుకులు అమరపెల్లి లచ్చయ్య, మల్లేశం అది ప్రభుత్వ భూమి అని తెలిసినప్పటికీ అదే గ్రామానికి చెందిన దేవి పద్మకు విక్రయించారు. ఆ తర్వాత ఆమె అదే గ్రామానికి చెందిన యాంసానికి మహేశ్‌కు విక్రయించింది. ఇలా ఆరు నెలల వ్యవధిలోనే ఆ భూమి ఇద్దరి పేర్లు మారి మూడో వ్యక్తి పేరిట రిజిస్టర్ అయ్యింది. అదే విధంగా, ధర్మారం మండలం ఎర్రగుంటపల్లిలోని ఎస్సారెస్పీ క్యాంపు కార్యాలయం పురాతన భవనానికి సంబంధించిన రెండున్నర గుంటల భూమిని స్థానికులు కబ్జా చేశారు. గ్రామానికి చెందిన వంగేటి సత్యారెడ్డి శిథిల భవనాన్ని కూల్చి ఆస్థానంలో నూతన భవనాన్ని నిర్మిస్తుండగా, గుర్తించిన ఎస్సారెస్పీ అధికారులు ఆ నిర్మాణాన్ని నిలిపివేయాలని సూచించారు. అయినా, వారు వినిపించుకోలేదు. ఇలా ఒకే మండలంలో రెండు ఆస్తులు కబ్జా కావడంతో ఎస్సారెస్పీ అధికారులు ఇటు రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు, పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

## మరో ఎకరానికి ఎసరు.. కబ్జా కాకుండా నోటీసు బోర్డులు

మరో ఎకరం భూమిని సైతం కబ్జాకు యత్నించడంతో ఎస్సారెస్పీ అధికారులు అప్రమత్తమయ్యారు. దీనికి తోడు ఆ స్థలంలో ఇది ఎస్సారెస్పీ స్థలం అని నోటీసు బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. ఒక వైపు కబ్జాకు గురైన భూమిలో చేపడుతున్న నిర్మాణాల విషయంలో తహసీల్దార్, పోలీసులను ఆశ్రయిస్తూనే నోటీసులు సైతం జారీ చేశారు.

## నిర్మాణానికి అనుమతి రద్దు

సర్వే నంబర్ 297లోని ఎస్సారెస్పీకి చెందిన 9 గుంటల భూమిలో నిర్మాణం కోసం కబ్జాదారులు గతంలో తీసుకున్న అనుమతులను గ్రామ పంచాయతీ రద్దు చేసింది. ఈ భూమికి సంబంధించి రిజిస్టర్ డాక్యుమెంట్లు సమర్పించడంతో 2023 సెప్టెంబర్ 9న గ్రామ పంచాయతీ యాంసాని మధు, మనోజ్‌కు నిర్మాణాల కోసం అనుమతి ఇచ్చింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సారెస్పీ అధికారులు పూర్తిస్థాయి మ్యాపులు, వివరాలను తెప్పించుకొని, ఆ భూమి తమదేనని పూర్తిగా నిర్ధారించి గ్రామ పంచాయతీకి ఒక లేఖను రాసింది. దీంతో అనుమతులను 2025 ఏప్రిల్ 19న రద్దు చేస్తూ నోటీసులు ఇచ్చింది.

## పోలీసులకు ఫిర్యాదు


రెండు చోట్ల ఎస్సారెస్పీ భూముల కబ్జా కావడంపై అధికారులు ధర్మారం పోలీసు స్టేషన్‌లో గత నెల 23న వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అమ్మేవారికి, కొన్నవారికి ఇది ప్రభుత్వ భూమి అని తెలిసినా రికార్డులను తారు మారు చేసి ప్రభుత్వ ఆస్తులను కాజేయాలనే కుట్రతో అమరపెల్లి లస్మమ్మ, ఆమె కొడుకులు లచ్చయ్య, మల్లేశం, దేవి పద్మ, ఆమె భర్త దేవి జనార్దన్, యాంసాని మహేశ్, ఆయన కుమారులు యాంసాని మధు, మనోజ్ కబ్జా చేశారని వీరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. మరోచోట వంగేటి సత్యారెడ్డి భూమి ఆక్రమించాడని, ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అదే రోజు మరో ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి కేసులు నమోదు చేసి పది రోజులైనా ఇంకా చర్యలు చేపట్టలేదు. ఈ విషయమై ధర్మారం ఎస్ఐ శీలం లక్ష్మణ్‌ను వివరణ కోరగా రెండు విషయాల్లో తమకు ఫిర్యాదులు అందాయని, విచారణ చేస్తున్నామని, పూర్తి విచారణ తర్వాత చర్యలు చేపడుతామన్నారు.



ఎస్ఆర్ఎస్‌పీ భూమిలో నిర్మిస్తున్న భవనం.

# వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలి

- ముస్లిం పర్సనల్ లాబోర్డు ఆధ్వర్యంలో ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా




తెలంగాణ చౌక్ నుంచి ర్యాలీగా బయలుదేరిన ముస్లింలు

కలెక్టరేట్, మే 3: వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించాలంటూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివచ్చి, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మోదీ, అమిత్‌షాకు వ్యతిరేకంగా నినదించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. లాబోర్డు జిల్లా శాఖ ప్రతినిధి ముఫ్తియూనుస్ మాట్లాడుతూ, వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేసేవరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రైతు వ్యతిరేక చట్టంపై చేసిన ఆందోళనల స్ఫూర్తితో వక్ఫ్ వ్యతిరేక చట్టంపై కూడా తాము దీర్ఘకాల ఆందోళనలు కొనసాగిస్తామని వెల్లడించారు. ముస్లింల ఆస్తులు కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసే క్రమంలోనే నల్లచట్టాలను తీసుకొచ్చారని దుయ్యబట్టారు. ర్యాలీలో ఎంఐఎం నాయకుడు అబ్బాస్ షమీ, సున్నీ మర్కజి మిలాద్ కమిటీ సభ్యుడు సయ్యద్ మొయిజుద్దీన్, ఖాద్రీయూసుఫ్, ముస్లిం పర్సనల్ లాబోర్డు జిల్లా కన్వీనర్ హఫీజ్ రిజ్వాన్, గుత్తేదారు కమాలొద్దీన్, బీఆర్‌ఎస్ నాయకుడు జమీలొద్దీన్, హఫీజ్ వసీమొద్దీన్, గులాం రబ్బానీ ఖాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి, మే 3: కరీంనగర్ కార్పొరేషన్, జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి నిర్వహించనున్న ఉచిత సమ్మర్ క్యాంపుపై ఆసక్తి ఉన్న విద్యార్థులు 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్ఓ వీ శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 క్రీడాంశాల్లో శిక్షణ ఉంటుందని, ఆరేండ్ల వయస్సు నుంచి 18 ఏండ్ల వయస్సులోపు విద్యార్థులు అర్హులని చెప్పారు. దరఖాస్తులు, ఇతర వివరాలకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో సంప్రదించాలని సూచించారు.